క్లుప్తంగా

ఠాక్రేకు శుభాకాంక్షల వెల్లువ



అభినందనలు తెలుపుతున్న మేయర్ పారిజాతనర్సింహారెడ్డి దంపతులు

బడంగ్‌పేట్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా ఉండి తెలంగాణలో అధికారంలోకి తీసుకొచ్చిన మానిక్‌రావు ఠాక్రేను శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి దంపతులు కలిశారు. పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పన్నాల రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

మంత్రిని కలిసిన పీసీసీ కార్యదర్శి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పీసీసీ కార్యదర్శి జానకీరాం

తుక్కుగూడ: హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిపొంది, రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డిని శుక్రవారం టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరాం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

స్పీకర్ ప్రసాద్‌కు అభినందనలు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: తెలంగాణ ప్రభుత్వంలో అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను స్థానిక నాయకులు శుక్రవారం కలిశారు. యూత్ కాంగ్రెస్ మహేశ్వరం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డితో కలిసి స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న కంచర్ల శివారెడ్డి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నియోజకవర్గంలో పేరుకుపోయిన చాలా సమస్యలను పరిష్కరించానని, ఇంకా ఏమైనా మిగిలి ఉంటే వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రజాపాలన షురూ

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రారంభమైందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకంలో భాగంగా నేటి నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. కడ్తాల మండలం మైసిగండిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొరలపాలన ముగిసిందని ప్రజాపాలన ప్రారంభమైందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరి భాగస్వామ్యం ఉంటుందని, తెలంగాణ ప్రజలు కోరుకున్న విధంగా రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందని ఆయన వివరించారు. రైతు భరోసా పథకం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని ఆయన వివరించారు. ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. నాయకులు జవహర్‌లాల్ నాయక్, హీరాసింగ్, తులసీరాం, రమేశ్, తులసీరాం నాయక్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మూసివేసిన గాయత్రినగర్ ప్రధాన రహదారి



బురదమయంగా మారిన రోడ్డు

రహదారి.. పూర్తయ్యే దారేది!

- గాయత్రినగర్‌లో ప్రధాన మార్గ నిర్మాణ పనులు
- రోడ్డు మూసివేతతో వాహనదారుల తిప్పలు
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలంటున్న స్థానికులు

మీర్‌పేట: రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యక్తిగత పనుల చేసుకోవాలంటే ప్రధాన రహదారి మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గాయత్రినగర్ ప్రధాన రహదారి అభివృద్ధి పనులు నాలుగు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. పై కాలనీల నుంచి డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణాన్ని సాకుగా చూపిన గుత్తేదారు మొదట్లో నెల రోజుల పాటు పనులు మధ్యలోనే వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. ప్రధాన రహదారి కావడంతో పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చేసేది లేక ఇక్కట్లు పడుతూనే రాకపోకలు కొనసాగిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయకపోవడంతో గతంలో ఓ వృద్ధుడు, యువకుడు ద్విచక్ర వాహనాల పైనుంచి కిందపడి గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు వేగంగా జరగకపోవడం, రహదారిని మూసివేయడంతో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు తమ గోడును వెలిబుచ్చుతున్నారు.

వ్యాపారుల ఆవేదన..

రోడ్డు పనులు మొదలైనప్పటి నుంచి వ్యాపారాలు దెబ్బతిన్నాయని స్థానిక దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని తెలిపారు. దీంతో వ్యాపారం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని వాహనదారులు, కాలనీవాసులు కోరుతున్నారు.

> **ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం**
>
> డ్రైనేజీ ఓవర్ ఫ్లో వల్ల మొదట్లో పనులు కొంత ఆలస్యమైంది. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వారంలోగా పూర్తి చేస్తాం.
>
> – గోపీనాథ్ డీఈ, మీర్‌పేట

నాడు కళాకారుడు... నేడు అర్చకుడు

- చరమాంకంలో దుర్భర జీవితం
- ఆదరణ లేక అవస్థలు పడుతున్న నటుడు వెంకటేశ్వరరావు
- ఆదుకోవాలని వేడుకోలు

అబ్దుల్లాపూర్‌మెట్: అతను ఒకప్పుడు మంచి రికార్డింగ్ వాయిద్య కారుడు.. అంతే కాకుండా అలనాటి పాత కాలపు సంగీత విద్వాంసుల బృందంలో ఒక సభ్యుడు.. దీంతో పాటు పాతకాలం సినిమాలైన రంగస్థలంలో హరిచంద్రుడిగా, రాయబారంలో కృష్ణుడిగా, రామాంజనేయ యుద్ధంలో ఆంజనేయుడి వంటి పాత్రలతో పాటు అంతస్తులు, ప్రేమించి చూడు, అవేకళ్ల వంటి చిత్రాల్లో నటించిన ఆర్టిస్టు. అలాంటి కళాకారుడికి నేడు ఆదరణ కరువవ్వడంతో వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నాడు. జానెడు పొట్ట కోసం దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తూ భక్తులు ఇచ్చే దక్షిణంతోనే పూట వెల్లదీసుకుంటున్నారు ముత్యాల వెంకటేశ్వరరావు(85). పుట్టి పెరిగింది కృష్ణా జిల్లా గుడివాడలో అయినా 30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో ఉంటూ భార్యతో కలిసి అక్కడక్కడ హరికథలు చెప్పుకుంటూ జీవనం సాగించాడు. క్రమంగా హరికథలు, రంగస్థల నాటకాలకు ఆదరణ లేకపోవడంతో



ప్రశంసా పత్రాలు చూపిస్తున్న వెంకటేశ్వరరావు

ఆయన రోజు రోజుకు దీనస్థితికి చేరుకున్నారు. దీంతో ఆర్థిక భారం వల్ల ఆయన భార్య ఏడాదిన్నర క్రితం మృతిచెందడంతో ఆయన రోడ్డున పడ్డారు. ఆదుకునే వారు లేక పోవడంతో ఇనాంగూడలో ఆంజనేయు ఆలయంలో వేతనం లేకుండానే అర్చకుడిగా పని చేస్తూ భక్తులు ఇచ్చే దక్షిణంతో జీవనం సాగిస్తున్నాడు. ప్రముఖుల నుంచి అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందినా వాటితో కడుపునింపుకోలేని దుస్థితిలో ఉన్నానని, తనను ప్రభుత్వం కానీ, చిత్ర, సంగీత పరిశ్రమలు కానీ ఆదుకోవాలంటూ వెంకటేశ్వరరావు (9849461848) వేడుకుంటున్నాడు. ప్రముఖ సంగీత విద్వాంసులైన ర్యాలీ పిచ్చయ్యశాస్త్రి(ఘంటసాల మేనమామ), ఎం.ఎస్ బాలసుబ్రమణ్యశర్మల వద్ద పనిచేశారు.

రేపు బీఆర్‌ఎస్ సమావేశం

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం బొంగుళూర్‌లోని క్లౌం జంగారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా పాలన



నేదునూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

కందుకూరు: మండలంలోని నేదునూరులో వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్ బేగ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలపై మొదటి సంతకం చేసినందుకు శుక్రవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడీల పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా పాలన తెచ్చారని కొనియాడారు. గత పాలకులు అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, పెంటయ్య, యంజాల్‌రెడ్డి, ఎండీ పాషా, ఎండీ మిస్కిన్‌ఖాన్, పాండురంగారెడ్డి, యాదయ్య, మహేందర్, దర్శన్, సుధాకర్, మహేశ్, శ్రీను, కృష్ణ, శంకర్, జగన్, భిక్షపతి, మైసయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

- అమీర్‌పేట్‌లో శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం
- హాజరైన ప్రముఖులు

మహేశ్వరం: వేద పండితుల మంత్రోచ్ఛరణలతో, డప్పు, వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా శుక్రవారం నిర్వహించారు. మండలంలోని అమీర్‌పేట్ గుట్టపైన వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారు, అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామంలో పూరవీధుల గుండా ఊరేగించారు. స్వామి వార్లకు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కనులపండువగా పండితులు, భక్తులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి కల్యాణానికి రావడం గర్వకారణమని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆమె హాజరై ఆలయ కమిటీ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ నర్సింగ్, ఎంపీటీసీ కుమారి రాయప్ప, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు జగదీష్, బుచ్చిబాబు, కోశాధికారి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు రాజు, నారాయణ చారి, దేవవరం గౌడ్, నర్సింహా నాయకులు యాదయ్య, పాపయ్య గౌడ్, అనంతయ్య గౌడ్, నందీశ్వర్ పూజారులు ప్రేమ్ శర్మ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



బ్రహ్మోత్సవాలకు హాజరైన అహోబిల రామానుజ స్వామి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోని ఎస్‌బీఆర్ కాలనీలో శుక్రవారం బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిన్నటిదాక ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. కోడ్ ముగియడంతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో మంజూరైన పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంతోషిరెడ్డి, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలో సర్పంచ్ ప్రేమలత, నాయకులు

ఆమనగల్లు: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ సర్పంచ్ ప్రేమలత ఆధ్వర్యంలో మొక్కులు తీర్చుకున్నారు. సింగంపల్లి గ్రామంలోని శ్రీకాశీ విశ్వనాథ ఆలయంలో శుక్రవారం సర్పంచ్ ప్రేమలత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 కొబ్బరికాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నర్సింహ, సత్తయ్య, ప్రసాద్, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి గెలిచాడని..

- యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర
- అభిమానం చాటుకుంటున్న కాంగ్రెస్ నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలిస్తే యాదగిరిగుట్టకు కాలినడకన వస్తామని కాంగ్రెస్ శ్రేణులు మొక్కుకున్నారు. వారి ఆశలు నెరవేరడంతో శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ నుంచి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో బొంగ్లూర్‌కు చెందిన 10 మంది బృందం యాదగిరిగుట్టకు పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా బొంగ్లూర్‌లోని ఈశ్వరాంజనేయ దేవాయలంలో పూజలు చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్‌రోడ్డు మీదుగా యాదగిరిగుట్టకు బయలుదేరారు. పాదయాత్ర చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బృందానికి మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి సంఘీబావం ప్రకటించారు. దిగ్విజయంగా యాత్ర పూర్తిచేయాలని సూచించారు. ఈ పాదయాత్ర ఆదివారం మధ్యాహ్నం యాదగిరిగుట్టకు చేరుకోనుంది. కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ గణేష్, ఉప సర్పంచ్ యాదగిరిరెడ్డి, రామారావు, రాంరెడ్డి తదితరులు పాదయాత్రగా బయలుదేరారు.



పాదయాత్రగా బయలుదేరిన నాయకులు

సర్వీస్ రోడ్ల ఆక్రమణతో ట్రా‘ఫికర్’

- పండ్ల మార్కెట్ వేరేచోటికి తరలించినా తప్పని ట్రాఫిక్ కష్టాలు
- సర్వీస్‌రోడ్డుపై డీసీఎంలు, చిరువ్యాపారుల తోపుడు బండ్లు తిష్ట
- రాకపోకలకు కాలనీవాసుల ఇక్కట్లు



సాయినగర్ ఐసీఐసీఐ బ్యాంక్ ఎదుట పండ్ల వ్యాపారుల వాహనాలతో నిండిన సర్వీస్‌రోడ్డు



ఓమ్ని ఆసుపత్రి ముందు రోడ్డులో డీసీఎం వాహనం నిలిపి వ్యాపారం చేస్తున్న దృశ్యం

చైతన్యపురి: గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ వల్ల కొత్తపేట, చైతన్యపురి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే ఉద్దేశంతో మార్కెట్‌ను వేరే చోటికి తరలించారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. చిరువ్యాపారులతో పాటు తోపుడుబండ్ల వారు, డీసీఎంలు ఆక్రమించడంతో సర్వీసు రోడ్డు కుంచించుకుపోయి వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

- చైతన్యపురి డివిజన్‌లోని చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాయం వరకు ఉన్న సర్వీస్ రోడ్డు, ఓమ్ని ఆసుపత్రి నుంచి నాగోల్ వెళ్లే రహదారులపై పండ్ల వ్యాపారులు చిన్న ఆటోలు, డీసీఎంల్లో పండ్లు పెట్టుకొని విక్రయిస్తున్నారు.
- ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌ల వల్ల ప్రభాత్‌నగర్, సాయినగర్, చైతన్యపురి రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- చైతన్యపురి మెట్రో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల రాకపోకలకు కష్టంగా మారింది.
- సర్వీస్ రోడ్డు పక్కనే రెండు జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ట్రాఫిక్ జామ్ కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- చైతన్యపురి, ప్రభాత్‌నగర్, సత్యనారాయణపురం, మారుతీనగర్, సాయినగర్, కాలనీలకు ఈ సర్వీస్ రోడ్డుపైనే వెళ్లాల్సి ఉంటుంది.
- సర్వీస్ రోడ్డు ఆక్రమణలకు గురి కావటంతో ఉదయం, సాయం వేళల్లో వాహనాలపై కాదు... కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది.
- రద్దీ సమయాల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.
- ఫుట్ పాత్‌ను ఆక్రమించుకోవడమే కాక కొందరు సర్వీస్ రోడ్డుపైనే తమ వస్తువులు పెట్టుకుని వ్యాపారాలు కొనసాగించటం వల్ల సమస్య మరింత జఠిలమవుతోంది.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డును ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరతున్నారు.



ఆక్రమణలను తొలగించాలని దీక్ష చేస్తున్న కాలనీవాసులు, కార్పొరేటర్ (ఫైల్)

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించండి



చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు ఉన్న సర్వీసు రోడ్డు ఆక్రమణకు గురి కావటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీస్ రోడ్డులో కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా ఉండటం లేదు. ప్రభాత్‌నగర్ కాలనీలోకి కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లడం అంటే.. పద్మవ్యూహంలోకి వెళ్లినంత పని అవుతోంది. ఒక రోజు దీక్ష చేపట్టి నిరసన తెలిపినా ప్రయోజనం లేకుండా పోయింది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–వెంకట రమణా చౌదరి, ప్రభాత్‌నగర్ కాలనీ

అధికారులు పట్టించుకోవటం లేదు



ప్రభాత్‌నగర్, సాయినగర్ కాలనీవాసులతో కలిసి ఒక రోజు ఆందోళన చేసినా అధికారుల్లో స్పందన లేదు. సర్వీస్ రోడ్డులో పండ్ల వ్యాపారులు వాహనాలను నిలపకుండా చూడాలని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గత నెలలో కాలనీవాసులతో కలిసి దీక్ష కూడా చేశాం. ఆయా శాఖల అధికారులతో సమీక్షించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం అని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

–రంగా నర్సింహగుప్తా, చైతన్యపురి కార్పొరేటర్

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

హస్తినాపురం: రౌడీషీటర్‌తో కలిసి దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం సీఐ దేప జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ అడ్డగుట్ట సొసైటీ ప్రాంతానికి చెందిన పీలా ఈశ్వర్ గణేశ్ ఈనెల 1వ తేదీ సాయంత్రం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం కొత్తగూడెం నుంచి తన ముగ్గురు మిత్రులు విశ్వకాంత్, సుజిత్, విష్ణులతో కలిసి తన కారులో నగరం వైపు బయలుదేరాడు. మార్గం మధ్యలో పెద్దఅంబర్‌పేట వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు (టీఎస్04ఈఎస్ 8885) గణేశ్ కారును ఢీకొట్టి ముందుకు వెళ్లిపోయింది. దీంతో ఆ కారును వెంబడించి హైకోర్టు కాలనీకి వద్ద ఆపి తమ కారు ధ్వంసమైందని, మరమ్మతు కోసం నష్టపరిహారం చెల్లించాలని అడుగుతుండగా... అదే సమయంలో ద్విచక్ర వాహనం (టీఎస్ 07ఎఫ్ఆర్ 9914)పై వచ్చిన ముగ్గురు ఏం జరిగిందని అడిగారు. ఆ ముగ్గురిలో ఓ వ్యక్తి ‘నా పేరు మంజునాథ్, వనస్థలిపురంలో రౌడీని, మీ సమస్యను పరిష్కరిస్తా’ అని అన్నాడు. గణేశ్‌కు ఎయిర్ గన్ చూపించి మీ ఫోన్లు, మీ దగ్గర ఉన్న డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. నిరాకరించడంతో వారిపై దాడి చేసి ఐఫోన్, విలువైన నైక్ షూ గుంజుకున్నారు. బాధితుడు గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం గ్రామానికి చెందిన పోలోజు శరత్‌చంద్ర (22), కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ప్రశాంత్ (23)లను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.50 వేల నగదు, ఒక ఐఫోన్, ద్విచక్ర వాహనం, మరో రెండు మొబైల్ ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న రౌడీషీటర్ మంజునాథ్ కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్నామని సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపారు.



నిందితులను చూపిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి